## సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

**9705347494**

నంబర్‌ను సంప్రదించండి

## క్లుప్తంగా

### ఆర్‌వీ పురం హైస్కూల్ హ్యాట్రిక్

**పద్మనాభం:** మండలంలోని ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో వరుసగా మూడేళ్ల అధిక మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారని హెచ్‌ఎం విజినిగిరి శంకరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23లో మరగడ శిరీష 573, 2023–24లో మరగడ హిందు 569 మార్కులు, 2024–25లో పల్లా నందిని 577 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారని పేర్కొన్నారు.

### పాండ్రంగి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మృతి



దేముడు బాబు(ఫైల్)

**పద్మనాభం:** పాండ్రంగి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆర్.ఎస్.దేముడుబాబు బుధవారం మృతి చెందారు. ఈయన కొంతకాలం డీసీఎంఎస్ డైరెక్టర్‌గా పని చేశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

### భగవన్నామ స్మరణతో మానసిక ప్రశాంతత



ప్రవచిస్తున్న పరమాత్మానంద గిరి స్వామి

**పద్మనాభం:** భగవన్నామ స్మరణతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని మలయాళ స్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమం పీఠాధిపతి పరమాత్మనంద గిరి స్వామి అన్నారు. మండలంలోని మద్దిలో లక్ష్మీనాయుడు కళ్లాల్లోని రామకోటి ఆశ్రమం నవమ, దుర్గా కాశీవిశ్వేశ్వర ఆలయ తృతీయ వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఆలయ ధర్మకర్త కనకల బంగారునాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బుగత శ్రీనివాసరావు, మొకర సన్నిబాబు పాల్గొన్నారు.

### బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారిగా సురేష్‌రెడ్డి

**తగరపువలస:** 2025–26 సంవత్సరానికి భీమిలి బార్ అసోషియేషన్ ఎన్నికల అధికారిగా న్యాయవాది సరగడ సురేష్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన ఎన్నికల అధికారిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఇది మూడోసారి. త్వరలో జరగనున్న బార్ అసోసియేషన్ ఎన్నికల సందర్భంగా బుధవారం 14 నామినేషన్లు స్వీకరించినట్టు సురేష్‌రెడ్డి తెలిపారు.

### రెడ్డిపల్లిలో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

**పద్మనాభం:** మండలంలోని రెడ్డిపల్లిలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు టైలరింగ్‌లో శిక్షణ పొంది, స్వయం ఉపాధి పొందాలన్నారు.

**విజయానందపురంలో ఏర్పాటుకు వినతి**

రెడ్డిపల్లి వచ్చి శిక్షణ పొందడం వ్యయ ప్రయాసలతో కూడుకున్నది కావడంతో విజయానందపురం జంక్షన్‌లో కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని నేరేళ్లవలస, చిన్నాపురం, కొయ్యపేట, విజయానందపురం మహిళలు ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి, వెలుగు ఏపీఎం సాయి రమేష్, మాజీ జెడ్పీటీసీ కె.దామోదరావు, కె.రమణ పాల్గొన్నారు.

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల రక్తదానం

**మధురవాడ:** మధురవాడ బక్కన్నపాలెం వద్ద గల సెయిల్స్ సాఫ్ట్‌వేర్ సాల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏఎస్‌రాజా బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో ఉద్యోగులు 30యూనిట్ల రక్తం దానం చేశారు. సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### బకాయి వేతనాలు చెల్లించాలి

**తగరపువలస:** ఉపాధి హామీ పనులు పూర్తి చేసినా ప్రభుత్వాలు బకాయిలు చెల్లించడం లేదని కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమిలి డివిజన్ సిటు ఆధ్వర్యంలో పెదనాగమయ్యపాలెంలో బుధవారం నిరసన తెలిపారు. జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి నాగరాణి, ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మీ అమ్మవారి ఉత్సవాలకు రాట

**మధురవాడ:** స్వతంత్రనగర్‌లో లక్ష్మీ అమ్మవారి ఉత్సవాలకు బుధవారం రాట వేసి, అంకురార్పణ చేశారు. కమిటీ అధ్యక్షుడు వాసుపిల్లి బండియ్య, ప్రధాన కార్యదర్శి బాలు పాత్రో, కోశాధికారి కొత్తల శ్రీనివాస్ దంపతులు రాట వేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 26 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అన్నసమారాధన ఉంటుందని తెలిపారు.

# పదిలో మెరిశారు

- ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- గురుకుల పాఠశాలలు, కేజీబీవీల్లో ఉత్తమ ఫలితాలు



పదో తరగతిలో టాపర్లను సత్కరిస్తున్న ఎంపీపీ రాంబాబు



584 మార్కులు సాధించిన శిరీషను అభినందిస్తున్న చంద్రంపాలెం హైస్కూల్ హెచ్‌ఎం రవి



594 మార్కులు సాధించిన రుచితను అభినందిస్తున్న భాష్యం ప్రిన్సిపాల్ రామచంద్రరావు



బి.ఒలీవ (578) | సీహెచ్.లాస్య (571) | జె.వెంకటకీర్తన్ (587) | ఎస్.జగదీష్ (581) | కె.హరికోమల (581) | తేజస్విని (586)



ఎస్.ఢిల్లీశ్వరి (579) | జి.వర్ధిని (577) | కొక్కిరి మేఘన (570) | మారిస దుర్గ (579) | ప్రవీణ్ (589) | పూర్ణిమ (564)

**తగరపువలస:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కుసుమాలు వికసించాయి. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పేద, సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులెందరో ప్రతిభ చూపారు. చదువుకు పేదరికం అడ్డు కాదని నిరూపించారు. కార్పొరేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు దీటుగా రాణించారు. తల్లిదండ్రుల కలలను నిజం చేశారు. తాము చదువుకున్న పాఠశాల ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు.

**భీమిలిలో 92శాతం..**

భీమిలి మండలంలో 92 శాతం మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలలో ఉత్తీర్ణులయ్యారు. గతేడాదితో పోలిస్తే ఒక్క శాతం పెరిగింది. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 1209 మంది విద్యార్థులు హాజరు కాగా 1014 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి 2825 మంది హాజరు కాగా, 2600 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 21 ప్రభుత్వ పాఠశాలలకు గాను ఎంజేపీ బీసీ వెల్ఫేర్ భీమిలి రెసిడెన్షియల్ పాఠశాల, ఏపీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలు మాత్రమే నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌కు చెందిన ఎం.వర్షిణి మండలంలోనే అత్యధికంగా 588 మార్కులు సాధించి మొదటి స్థానంతో నిలవగా ఇదే పాఠశాల నుంచి బి.ఒలీవ 578, సీహెచ్ లాస్య 571 మార్కులు సాధించారు.

- చిట్టివలస బాలుర జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జె.వెంకటకీర్తన్ 587 మార్కులతో రెండోస్థానంలో నిలిచాడు. ఇదే పాఠశాల నుంచి ఎస్.జగదీష్ 581, కె.హరి కోమల 581 మార్కులు సాధించారు.
- పెద మంగమారిపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు తక్కువగా 61 శాతం ఉత్తీర్ణత సాధించారు.

**అధిక మార్కులు సాధించిన విద్యార్థులు**

ప్రభుత్వ పాఠశాలల వారీగా అత్యధికంగా మజ్జిపేట జెడ్పీహైస్కూల్ నుంచి మజ్జి రజని 575, లక్ష్మీపురం నుంచి బోని ధరణి 559, మజ్జివలస నుంచి కాగితాల రాధ 570, తాటితూరు నుంచి బట్టు రుత్విక్‌రెడ్డి 561, రాంబోతు సంపత్ వినాయక్ 551, సూరింటి మనీషా 546 మార్కులు సాధించారు. అమనాం నుంచి జోగ అంజలి 548, చిప్పాడ నుంచి బోర ధరణి 560, జీరు అన్నపూర్ణ 523, పంచదార్ల మౌనిక 515 మార్కులు సాధించారు. తాళ్లవలస నుంచి ఆర్.జ్యోతిక 579, అంబేడ్కరు జీవీఎంసీ హైస్కూల్ నుంచి ఆలేటి సాయివర్ధన్ 567, రాయిప్పాలెం హైస్కూల్ నుంచి కోరాడ గోపిక 494 మార్కులు సాధించారు.

**ఆనందపురం మండలంలో 83 శాతం..**

**తగరపువలస:** పదో తరగతి పరీక్ష ఫలితాలలో ఆనందపురం మండలంలో 83 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో కేజీబీవీతో కలిసి 12 జెడ్పీ హైస్కూళ్లకు సంబంధించి 695 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 579 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో అత్యధికంగా బోని జెడ్పీ హైస్కూల్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో 71 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో అత్యధికంగా గిడిజాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎస్.ద్రాక్షాయణి 584 మార్కులు సాధించగా, గొట్టిపల్లి హైస్కూల్ విద్యార్థిని టి.రేష్మ 581, కేజీబీవీ విద్యార్థులు ఎస్.ఢిల్లీశ్వరి 579, జి.వర్ధిని 577 మార్కులు సాధించారు. రామవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి పి.వేణుగోపాల్ 574, శొంఠ్యాం విద్యార్థిని జి.కీర్తన 567, ఆనందపురం విద్యార్థి ఎం.ఉపేంద్ర 564, బోయపాలెం విద్యార్థిని డి.ఈశ్వరమ్మ 562, బోని విద్యార్థిని కె.వైష్ణవి 553, తర్లువాడ విద్యార్థిని పి.తేజస్విని 536, శిర్లపాలెం విద్యార్థి కె.స్వామిశేఖర్ 532, వెల్లంకి విద్యార్థి ఎస్.చందు అత్యధికంగా 531 మార్కులు సాధించారు. కేజీబీవీలో 9 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. వీరిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

**పద్మనాభంలో 98.09 శాతం ఉత్తీర్ణత**

**పద్మనాభం:** మండలంలోని తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతిలో 98.09 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో పి.రమణ తెలిపారు. అనంతవరం పాఠశాలలో 43 మందికి 42 మంది, బి.ఆర్.తాళ్లవలసలో 69 మందికి 69మంది, గంధవరంలో 33 మందికి 32, మద్దిలో 29 మందికి 29, పద్మనాభంలో 50 మందికి 48, , రెడ్డిపల్లిలో 78 మందికి 76, రేవిడిలో 71 మందికి 69, విజయానందపురంలో 34 మందికి 34, కస్తూర్బా విద్యాలయంలో 38 మందికి 38, పాండ్రంగిలో 26 మందికి 25 మంది ఉత్తీర్ణులైనట్టు తెలియజేశారు. 471 మందికి 462 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు.

**టాపర్లకు సన్మానం**

పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన నలుగురు విద్యార్థులను మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు దుశ్శాలువాలతో సత్కరించారు. ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పల్లా నందిని 577 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. అదే పాఠశాలకు చెందిన సారికి గాయత్రి 576 మార్కులు, బీఆర్ తాళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.మేఘన 576 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. 575 మార్కులతో బీఆర్ తాళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.సంజన మూడో స్థానం సొంతం చేసుకోవడంతో వారిని ఎంపీపీ సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు పి.రమణ, ఎస్డీ బాబూలాల్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఉద్యోగంలో చేరి ప్రజలకు సేవ చేస్తాను



ఉపాధ్యాయుల సహకారంతో మండలంలోనే అత్యధికంగా 588 మార్కులు సాధించాను. మా నాన్న బాలాజీ సైకిల్ మెకానిక్, అమ్మ జయలక్ష్మి గృహిణి, ట్రిపుల్ ఐటీలో చదువయ్యాక, ప్రభుత్వ ఉద్యోగంలో చేరి ప్రజలకు సేవ చేస్తాను.

–మాదాబత్తుల వర్షిణి(588)
చిట్టివలస జెడ్పీ హైస్కూల్

### ప్రజాసేవే లక్ష్యం



ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసి ప్రజాసేవ చేసేందుకు అనువైన ఉద్యోగం సాధించాలన్నదే నా కల. ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల సహకారంతో 581 మార్కులు సాధించాను.

–గేదెల కేశవి,
కేథరిన్ పబ్లిక్ స్కూల్, భీమిలి

**గురుకుల పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత**

**భీమునిపట్నం:** భీమిలిలోని ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాల పదో తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించింది. 85మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరు కాగా, అందరూ ఉత్తీర్ణత సాధించారు. 68 మంది 500మార్కులకు పైగా సాధించారు. వారిని ప్రిన్సిపాల్ జయప్రకాశ్ అభినందించారు.

**కూలీ బిడ్డకు 592 మార్కులు**

గురుకుల పాఠశాల విద్యార్థిని రెడ్డి భవ్యశ్రీ పదో తరగతిలో 592 మార్కులు సాధించింది. ఆమె తండ్రి వ్యవసాయ కూలి. వారిది అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం కేజే పురం. ఐఏఎస్ అధికారి కావాలనేది తన లక్ష్యమని భవ్యశ్రీ తెలిపింది.

**కేజీబీవీలో 99 శాతం ఉత్తీర్ణత**

కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 39మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా, 38 మంది ఉత్తీర్ణత పొంది 99 శాతం సాధించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రిన్సిపాల్ గంగాకుమారి అభినందించారు. వీరిలో భీమిలికి చెందిన కొక్కిరి మేఘన 570మార్కులు సాధించింది. ఈమె తండ్రి మురళి ఆటోడ్రైవర్. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం తన లక్ష్యమని మేఘన తెలియజేసింది.

- నెర్రెలా ఉన్నత పాఠశాలలో 78మంది పరీక్షలకు హాజరు కాగా 64మంది ఉత్తీర్ణత పొందగా 82శాతం సాధించారు. ఇందులో కొల్లి మోహన్‌సాయి 567మార్కులు సాధించాడు.
- జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 57మంది హాజరు కాగా అందులో 39 మంది ఉత్తీర్ణత పొంది, 67శాతం సాధించారు, ఇందులో మరిస దుర్గ 579 మార్కులు సాధించింది. ఈమె తండ్రి వ్యవసాయ కూలీగా చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలన్నది తన లక్ష్యమని చెప్పింది.
- నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆవాస్ విద్యాలయలో 32 మందికి 31మంది ఉత్తీర్ణత సాధించి, 99శాతం సాధించారు. ఇందులో జశ్వంత్‌నాయుడు 545మార్కులు సాధించాడు.
- ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 58మందికి 44మంది ఉత్తీర్ణత పొందగా, 80శాతం సాధించారు.
- కేతిన్‌పేట సన్‌స్కూల్‌లో 169మంది విద్యార్థులకు అందరూ ఉత్తీర్ణులై, శతశాతం సాధించారు. వారిలో ఇందులో పి.మానస అత్యధికంగా 596 మార్కులు సాధించగా మరో తొమ్మిది మంది 590కు పైగా మార్కులు సాధించారు. వీరిని స్కూల్ కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు, అధ్యక్షురాలు లక్ష్మిలావణ్య అభినందించారు.

**చంద్రంపాలెం హైస్కూల్లో 66 శాతం..**

**మధురవాడ:** చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 799మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా, 531మంది ఉత్తీర్ణత సాధించి 66 శాతం ఉత్తీర్ణత పొందారు. 550పైగా మార్కులు 22మంది సాధించగా, 500పై 90మంది సాధించారు. పాఠశాల టాపర్‌గా 584 మార్కులు సాధించి ఎస్.శిరీష నిలవగా, 583 మార్కులతో ఎస్.లావణ్య ద్వితీయ స్థానంలో, 579మార్కులతో కె.తనీష్ సామిత్ తృతీయ స్థానంలో నిలిచారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి, ఉపాధ్యాయులు అభినందించారు.

- మారికవలస గురుకుల గిరిజన బాలికల ఎస్‌వోఈలో తేజస్విని 586 మార్కులు సాధించింది.
- రేవళ్లపాలెం శ్రీనివాస పాఠశాలలో కొమ్మాదికి చెందిన పేదింటి విద్యార్థి కె.ప్రవీణ్ 589 మార్కులు సాధించాడు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అభినందించారు.
- మధురవాడ భాష్యం స్కూల్‌లో రుచిత 594 మార్కులు సాధించగా ప్రిన్సిపాల్ డి.రామచంద్రరావు అభినందించారు. మధురవాడ బక్కన్నపాలెం రోడ్డులో శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో హృదయశాంతి 598, అనన్య 597మార్కులు సాధించగా వారిని ప్రిన్సిపాల్ సందీప్ తదితరులు అభినందించారు.
- వాంబే కాలనీ సునీల్‌శర్మ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 65 మంది హాజరు కాగా 45మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో కె.భువన 539, పి.హనోక్ 537మార్కులు సాధించగా వీరిని హెచ్‌ఎం గీతాదేవి అభినందించారు.

**ఎండాడ హైస్కూల్లో ఉత్తమ ఫలితాలు**

**కొమ్మాది:** 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయిని వానపల్లి శైలజ తెలిపారు. 564 మార్కులు సాధించిన బాలిరెడ్డి పూర్ణిమ ప్రథమ స్థానంలో, 549 మార్కులతో మన్యాల శృతి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఆమె తెలియజేశారు. ఫస్ట్‌క్లాస్‌లో 33మంది, సెకండ్ క్లాస్‌లో 15 మంది, థర్డ్ క్లాస్‌లో 13 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. వారిలో ఏడుగురు విద్యార్థులకు 500కు పైగా మార్కులు వచ్చాయన్నారు.

**అంధ బాలికల పాఠశాల వెనుకంజ**

సాగర్‌నగర్‌లోని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఈ ఏడాది 10 తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం ఒక్కసారిగా పడిపోయింది. ఏటా 10వ తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించే ఈ పాఠశాల ఈ ఏడాది 33 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించింది. 6 గురు విద్యార్థులు పరీక్షలు రాయగా నలుగురు ఫెయిల్ అయ్యారు. ఒక్కరు పాస్ కాగా మరో విద్యార్థిని ఫలితాలు తప్పుగా వచ్చాయని పాఠశాల యాజమాన్యం ప్రకటనలో తెలిపింది.

## విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..



కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

**తగరపువలస:** ఎట్టకేలకు భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ ఎస్సీ కాలనీలో విద్యుత్ సమస్యను భీమిలి సబ్‌స్టేషన్ ఏఈఈ యు.సకరయ్య పరిష్కరించారు. కాలనీలో గత ఐదు రోజులుగా రాత్రి నుంచి తెల్లవార్లు విద్యుత్ కోతలు విధిస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ సమయంలో సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లినా సిబ్బంది అందుబాటులో ఉండేవారు కాదు. ఈ నెల 21న అర్ధరాత్రి కూడా ఎస్సీ కాలనీవాసులు ఇదే విధంగా ఆందోళనకు దిగడంతో 'అర్ధరాత్రి సబ్‌స్టేషన్ వద్ద నిరసన' శీర్షికతో 22న సాక్షిలో ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన సిబ్బంది బుధవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.

## 'భూమిని విక్రయిస్తామని రూ.99 లక్షలు కాజేశారు'



చందకలో వివరాలు వెల్లడిస్తున్న దళిత నాయకులతో బాధితురాలు కుంచంగి లక్ష్మి

**తగరపువలస:** ఆనందపురం మండలం చందక పంచాయతీ సర్వే నంబర్ 67/11 తదితర నంబర్లలో వేరొకరికి చెందిన 30 సెంట్ల భూమిని వారిదిగా నమ్మించి, విక్రయిస్తామంటూ ఆనందపురం మండలానికి చెందిన మీసాల అప్పలనాయుడు, బంగారునాయుడు, చిన్నారావు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి మురళి తన నుంచి దఫదఫాలుగారూ.99 లక్షలు కాజేశారని నగరానికి చెందిన దళిత మహిళ కుంచంగి లక్ష్మి ఆరోపించారు. జిల్లా దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చందకలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మీసాల అప్పలనాయుడు తదితరులు భౌతికంగా భూమిని చూడనీయకుండానే 2020 జనవరిలో తనకు ఈ మేరకు పురోణి రాశారన్నారు. తరువాత తాను మోసపోయినట్టు గ్రహించి డబ్బులు లేదా భూమి ఇవ్వాలని డిమాండ్ చేయగా మూడు నెలల్లో ఇస్తామని అగ్రిమెంట్ చేశారన్నారు. అనంతరం విచారించగా వీరికి అసలు భూమితో సంబంధం లేదని, హైదరాబాద్‌కు చెందిన రెడ్డి జయమ్మదిగా తేలిందన్నారు. అప్పలనాయుడుకు తాను ఇచ్చిన డబ్బులో రూ.85 లక్షలు జయమ్మ తీసుకున్నట్టు తెలిసిందన్నారు. మిగిలిన డబ్బు ఈ మధ్యవర్తులు పంచేసుకున్నారన్నారు. డబ్బులు ఇవ్వకపోగా తమపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. తనను వేధిస్తున్న వారితో పాటు వారికి సహకరిస్తున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపించాలని కోరారు.

## నాగభూషణరావుకు ఘన నివాళి



నాగభూషణరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చిన్న శ్రీను, కరణం ధర్మశ్రీ

**తగరపువలస:** ఇటీవల మృతి చెందిన భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు సంస్మరణ సభ బుధవారం వేములవలసలో జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి వెంట జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, బంటుపల్లి మణిశం కరనాయుడు తదితరులు ఉన్నారు.

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు నాగభూషణరావుకు నివాళులు అర్పించారు.

## ఊరూపేరూ లేని కంపెనీ పేరుతో భారీ భూ కుంభకోణం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి



**తగరపువలస:** ఊరూపేరు లేని కంపెనీల పేరుతో కూటమి ప్రభుత్వం విశాఖలో భారీ భూ కుంభకోణానికి తెర తీసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన చిట్టివలసలో మాట్లాడారు. దావోస్ పర్యటనలో రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో ఘోరంగా విఫలమైన కూటమి ప్రభుత్వం అస్మదీయ కంపెనీలకు వేలకోట్ల విలువైన భూములు కట్టబెట్టడానికి తెగ ఆరాటపడుతోందన్నారు.

**'ఉర్సా'పై చంద్రబాబుకు ఎందుకంత ప్రేమ?**

ఐటీ రంగంలో ఊరూపేరు తెలియని ఉర్సా క్లస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ పట్ల చంద్రబాబుకు ఎందుకంత ప్రేమ అని ప్రశ్నించారు. 2004లో ఐజీఎం భారత్ పేరుతో బిల్లీరావుకు రూ.400 కోట్ల విలువైన భూములు, ఇప్పుడు ఉర్సాలకు దొడ్డిదారిన రూ.3వేల కోట్ల విలువైన భూములు కేటాయించడం వెనుక భూములు దోచుకోవాలన్న ఎజెండా చంద్రబాబు, లోకేష్‌లలో కనిపిస్తోందన్నారు. ఉర్సాతో తప్పుడు ఒప్పందాన్ని రద్దు చేసి, భూ కుంభకోణంలో పాత్రధారులైన ఎంపీ కేశినేని చిన్ని, కంపెనీ డైరెక్టర్ అబ్బూరి సతీష్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.